క్లుప్తంగా

పంచారామ క్షేత్రంలో భక్తుల కిటకిట


సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామివారు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రీతైన రోజు కావడంతో తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారి తొలిపూజ, తొలి అభిషేకాలను తిలకించడానికి బారులు తీరారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో తొలిపూజను ఆలయ పండితులు నిర్వహించారు. ఆలయంలో ఉన్న ఉపాలయాల్లోనూ పూజలు చేశారు. సాయంత్రం స్వామివారిని, అమ్మవార్లకు ప్రత్యేకాలంకరణ చేశారు. ఆలయ ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, కొంతేటి జోగారావు, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు వినయ్, చంటి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ

కొత్తపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ వెంకటనారాయణ సోమవారం తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జరిగిన ఉపాధి పనులపై ఈ సామాజిక ప్రజావేదిక జరుగుతుందని చెప్పారు. సంబంధిత అధికారులు, ఉపాధి సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

వలంటీరు పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సామర్లకోట: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణ పరిధిలో ఖాళీగా ఉన్న ఓ వలంటీరు పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ–డి జనరల్ కేటగిరీకి సంబంధించి రేపటి(బుధవారం) నుంచి 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. పదో తరగతి విద్యార్హత కలిగి, స్థానికులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

బాణసంచా షాపుల ఏర్పాటుకు స్థల పరిశీలన


సామర్లకోట జూనియర్ కళాశాల మైదానంలో స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

సామర్లకోట: దీపావళి సందర్భంగా పట్టణ, మండల ప్రాంతాల్లో బాణసంచా షాపులను ఏర్పాటు చేసేందుకు త్రిమెన్ కమిటీ సభ్యులైన పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక అధికారులు సోమవారం పలుచోట్ల స్థలాలను పరిశీలించారు. వేట్లపాలెంలోని కెనాల్ రోడ్డు సమీపంలో, సామర్లకోట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో షాపుల ఏర్పాటుకు స్థలాలను పరిశీలించారు. బాణసంచా షాపుల నిర్వహణకు సంబంధించిన నిబంధనలు పూర్తిగా పాటించాలని సీఐ కె.దుర్గాప్రసాద్, అగ్నిమాపక దళ జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ ఎం.శ్రీహరి జగన్నాథ్ ఆదేశించారు. వీరితో తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, వీఆర్వోలు, అగ్నిమాపక, పోలీసు సిబ్బంది, షాపుల యజమానులు ఉన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత అని పెద్దాపురం ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ స్పందన హాలులో సోమవారం 'బాల్య వివాహాలు చట్ట విరుద్ధం' వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఐసీడీఎస్ సీడీపీఓ ఉష అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండని యువతికి, 21 ఏళ్లు నిండని యువకులకు ఎక్కడైనా వివాహాలు జరిపితే, వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారికీ జైలు శిక్ష తప్పదన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తున్నట్టు తెలిస్తే 1098, 100 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ బాలామణి, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, డీవైఈఓ సుభద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముగ్గురికి గాయాలు

గోకవరం: గోకవరం శివారున గంగాలమ్మ ఆలయం సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. కామరాజుపేటకు చెందిన ముగ్గురు వ్యక్తులు బైక్‌పై రాజమహేంద్రవరం నుంచి గోకవరం వైపు వస్తుండగా గంగాలమ్మ ఆలయం సమీపంలో ఆటో వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

సంక్షేమ కాంతులు

- కుటీర పరిశ్రమలు, దుకాణాల నిర్వహణకు ఆర్థిక తోడ్పాటు
- ఆర్థికాభివృద్ధి దిశగా మహిళలు


తినుబండరాల తయారీలో నిమగ్నమైన మహిళ


పచ్చడిని ప్యాక్ చేస్తున్న మహిళ

కొత్తపల్లి: మహిళల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నవరత్నాలు.. మహిళల ఆర్థికాభివృద్ధిలో ఎంతో తోడ్పాటునిస్తున్నాయి. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం, వైఎస్సార చేయూత, వైఎస్సార్ ఆసరా తదితర పథకాలతో పాటు పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తోంది. బ్యాంకుల నుంచి విరివిగా రుణాలను మంజూరు చేస్తోంది. గత నాలుగున్నరేళ్లుగా వివిధ పథకాల కింద ప్రభుత్వం అందించిన ఆర్థికసాయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. కుటీర పరిశ్రమలు, కిరాణా, టైలరింగ్ వంటి దుకాణాలు నిర్వహిస్తూ.. ఆర్థికాభివృద్ధి చెందుతున్నారు. కుటుంబానికి అండగా నిలిచి, జీవనోన్నతికి బాటలు వేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే పిఠాపురం నియోజకవర్గంలోని 1,630 మంది జగనన్న చేదోడు పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు.

సున్నా వడ్డీ భరోసా

మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని నింపి, ఆర్థిక భరోసా కల్పించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సున్నా వడ్డీ పథకాన్ని అమలు చేస్తోంది. దిగువ, మధ్య తరగతి మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా బ్యాంకులతో పాటు మల్టీ నేషనల్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుని.. వ్యాపార, స్వయం ఉపాధి రంగాల్లో ప్రోత్సహిస్తోంది. క్రమంతప్పకుండా బ్యాంకు రుణాలు తిరిగి చెల్లిస్తున్న వారికి వడ్డీ రాయితీని కూడా ప్రభుత్వమే భరిస్తోంది. వైఎస్సార్ ఆసరా పథకం కింద ఆర్థికసాయం అందించడంతో పాటు, వ్యాపార రంగంలో రాణించేలా చర్యలు చేపట్టింది. సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ కూడా ఇస్తోంది. 45–60 ఏళ్ల ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల మహిళలకు నేరుగా రూ.18,750 చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తోంది.

నియోజకవర్గంలో పథకాల వివరాలు

పథకం పేరు	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
వైఎస్సార్ సున్నా వడ్డీ	50,990	15.17
వైఎస్సార్ చేయూత	13,145	72.47
బ్యాంకు లింకేజీ	45,300	43.0
వైఎస్సార్ ఆసరా	41,620	99.28
జగనన్న తోడు	14,466	14.46


చేపలను ఎండబెడుతున్న మహిళ

మంచి అన్న దొరికాడు



మహిళందరికీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఓ అన్నలా ఆదుకుంటున్నారు. ఏ ప్రభుత్వం గతంలో ఎలాంటి ఆర్థిక సాయాన్ని అందించలేదు. జగనన్న ప్రభుత్వం వచ్చాక ఏటా చేదోడు పేరుతో రూ.10 వేలను బ్యాంకు ఖాతాకు జమ చేస్తున్నారు. దీంతో టైలరింగ్ దుకాణం పెట్టుకుని.. ఉపాధి పొందడంతో పాటు 20 మందికి శిక్షణ ఇస్తున్నాను.

– వాసంశెట్టి దేవీ, టైలర్, ఉప్పాడ

మహిళలకు భరోసా కల్పిస్తోంది

ప్రభుత్వం మహిళలకు భరోసానిస్తూ.. అనేక పథకాల ద్వారా ఆర్థికంగా ఆదుకుంటోంది. మహిళలకు బ్యాంకు లింకేజీతో పాటు సున్నా వడ్డీ పథకం రాయితీ, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా వంటి పథకాల ద్వారా మహిళలకు ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తోంది. ఆర్థికాభివృద్ధి చెందాలన్న ముఖ్యోద్దేశంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలన్నింటిలోనూ మహిళలను ప్రధాన లబ్ధిదారుగా చేర్చింది. ప్రభుత్వ లబ్ధిని సద్వినియోగం చేసుకుని, మహిళలంతా ఆర్థికాభివృద్ధి సాధించాలి.

– సబీనా ప్రియదర్శిని, ఏపీఎం, మండల మహిళా సమాఖ్య, పిఠాపురం

భారీ అన్న సమారాధన


అన్న సమారాధనలో పాల్గొన్న దవులూరి దొరబాబు

సామర్లకోట: శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక బళ్ల మార్కెట్ సెంటర్‌లో సోమవారం భారీ అన్న సమారాధన జరిగింది. దుర్గమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పాల్గొన్నారు. ఆయన వెంట కౌన్సిలర్ నేతల హరిబాబు, కమిటీ సభ్యులు ఉన్నారు. సుమారు ఆరు వేల మందికి అన్నదానం చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

రాష్ట్రానికి తీరని అన్యాయం

సీపీఎం ప్రచార యాత్రలో నేతలు



బహిరంగ సభలో మాట్లాడుతున్న ధనలక్ష్మి

పెద్దాపురం: బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని పలువురు వక్తలు దుయ్యబట్టారు. శ్రీకాకుళం జిల్లా మందసలో ప్రారంభమైన సీపీఎం ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర సోమవారం పెద్దాపురం పట్టణం చేరుకుంది. స్థానిక మెయిన్‌రోడ్డు ఆంజనేయ స్వామి గుడి వద్ద సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కరణం ప్రసాదరావు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ధనలక్ష్మి, నాగేశ్వరరావు, హరిబాబు మాట్లాడుతూ ప్రజా సమస్యలనే రాజకీయ అజెండాగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. కరెంట్ చార్జీలు, ఆస్తిపన్ను, చెత్తపన్ను పెంపుతో రాష్ట్ర ప్రజలపై భారం పడిందన్నారు. బడా కార్పొరేట్లకు లక్షల కోట్లు అప్పగిస్తున్న కేంద్రం, ప్రజలకు మాత్రం మొండిచేయి చూపుతోందని విమర్శించారు. తొలుత పెద్దాపురం మున్సిపల్ సెంటర్‌లో జాతాకు స్వాగతం పలికిన నాయకులు, అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం, మంతెన సీతారాం, మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్, కేదారి నాగు, డి.క్రాంతికుమార్, మాగాపు నాగు, గడిగట్ల సత్తిబాబు, వడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అద్భుత కార్యక్రమం ఆరోగ్య సురక్ష


హెల్త్, మున్సిపల్ సిబ్బందిని అభినందిస్తున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశ చరిత్ర లోనే ఒక అద్భుత కార్యక్రమంగా జగనన్న ఆరోగ్య సురక్షను ప్రవేశపెట్టారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మున్సిపాలిటీలోని 17, 18 వార్డులకు సంబంధించి ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ సోమవారం యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథి దొరబాబు మాట్లాడుతూ సచివాలయాల పరిధిలోని ప్రజల ఆరోగ్య పరిస్థితిని ముందుగానే హెల్త్ సిబ్బంది, వలంటీర్ల ద్వారా ఇంటింటా సర్వే చేయించి, ఆరోగ్య సురక్ష శిబిరాల్లో వైద్యం అందించినట్టు వివరించారు. ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున, ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏటా ప్రతి కుటుంబానికి ఆరోగ్యశ్రీ కార్డుపై రూ.ఐదు లక్షల వరకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందుతుందని చెప్పారు. కుటుంబ యజమాని ఆపరేషన్ అనంతరం విశ్రాంతి తీసుకుంటే, నెలకు రూ.ఐదు వేల ఆర్థికసాయం లభిస్తుందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు విజయవంతంగా ముగియడంతో వైద్య, మున్సిపల్ సిబ్బందిని దొరబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు గిరజాల బాబు, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, కమిషనర్ జె.రామారావు, హెచ్‌ఎం యు.సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. డాక్టరు జ్యోతి, భవ్య వైద్య పరీక్షలు నిర్వహించారు. పట్టణ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పోషకాహార ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు.

స్పందనకు తొమ్మిది అర్జీలు

పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు


స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: ప్రతి వారం నిర్వహించే డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం వివిధ మండలాల నుంచి తొమ్మిది అర్జీలు అందినట్టు పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు తెలిపారు. పట్టణంలోని పరిశ్రమల నుంచి వెలువడుతున్న నల్ల బూడిద నివారణపై చర్యలు చేపట్టాలని, కుల ధ్రువీకరణ పత్రాల మంజూరులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, భూమి రీసర్వే చేయాలని తదితర సమస్యలపై ఈ ఫిర్యాదులు అందినట్టు వివరించారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతివారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని సంబంధిత శాఖకు బదిలీ చేసి, సమస్య పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఈ వారం వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ బాలామణి, డీటీ భానుకుమార్, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, ఏడీఏ దైవకుమార్, సీడీపీఓ ఉష, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మోపిదేవిని కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు


కాకినాడలో బస్సు యాత్రకు వచ్చిన మోపిదేవిని కలిసిన కొత్తపల్లి వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: కాకినాడలో నిర్వహించిన ప్రజా సాధికార బస్సు యాత్ర కార్యక్రమానికి వచ్చిన రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణను సోమవారం వైఎస్సార్ సీపీ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వీరిలో కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మత్స్యకార నాయకుడు కంబల లక్ష్మణరావు, అడ్డా త్రిమూర్తులు తదితరులు ఉన్నారు.

జోరుగా ఓటర్ల జాబితా సవరణలు


ఓటర్ల జాబితా సవరణల ప్రక్రియను పరిశీలిస్తున్న ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి సుబ్బారావు

పిఠాపురం: నిబంధనలకు విరుద్ధంగా ఒక్క ఓటు కూడా తొలగించరాదని రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు స్థానిక ఎన్నికల అధికారులు ఓటర్ల జాబితా సవరణలను పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం సవరణలకు అవకాశం ఇచ్చిన అధికారులు రెండు రోజుల పాటు ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు. పిఠాపురం నియోజకవర్గ పరిధిలో కొత్త ఓటర్ల నమోదుకు 1,035 మంది దరఖాస్తు చేసుకోగా, రద్దయిన ఓటు హక్కు కోసం 242 మంది, తప్పులు సరిచేయాలని 566 మంది దరఖాస్తులు సమర్పించారు. మొత్తం 1,843 దరఖాస్తులపై ఎన్నికల సిబ్బంది విచారణ చేపట్టారు. అర్హులైన ఓటర్లను తిరిగి జాబితాలో చేర్చడానికి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నారు.

పిఠాపురం నియోజకవర్గంలో పిఠాపురం మున్సిపాలిటీ, పిఠాపురం మండలం, గొల్లప్రోలు నగర పంచాయతీ, గొల్లప్రోలు మండలం పరిధిలో ఆయా ఎంపీడీఓ కార్యాలయాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన సమగ్ర అవగాహన కార్యక్రమాల్లో అధికారులు బీఎల్‌ఓలకు నిర్దిష్ట సూచనలు చేశారు. అక్టోబర్ 27న ఎన్నికల జాబితా ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయగా, పిఠాపురం నియోజకవర్గ ముసాయిదా ఓటరు జాబితాలో పురుషులు 1,14,261, స్త్రీలు 1,13,942, ఇతరులు ముగ్గురు.. మొత్తం 2,28,206 మంది ఓటర్లు ఉన్నారు. వచ్చే ఏడాది జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన వారి నుంచి డిసెంబర్ 9 వరకూ దరఖాస్తులు స్వీకరించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. 2024 జనవరి 5న ఓటర్ల తుది జాబితా విడుదల చేయనున్నారు. ఇందులో భాగంగా బూత్ లెవెల్ అధికారులకు పూర్తి అవగాహన కల్పించారు. అర్హులైన ఓటర్ల నమోదు, మరణించినా శాశ్వత వలస వెళ్లినా, డబుల్ ఎంట్రీ పడిన ఓటర్లను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం తొలగించి, దోషాల్లేని ఓటరు జాబితా రూపొందించడానికి అధికారులు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఓటర్ల జాబితా సవరణలు జోరుగా సాగుతున్నాయి. ఒక వ్యక్తి మూడు కంటే ఎక్కువ క్లెయిమ్‌లు దాఖలు చేస్తే, త్రీ మెంబర్ కమిటీ ద్వారా ఆ వ్యక్తిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో ప్రతి మంగళవారం సమావేశాలు నిర్వహించి, ఓటరు జాబితా సవరణపై ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చే ఏర్పాట్లు చేసినట్లు పిఠాపురం నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి కె.సుబ్బారావు తెలిపారు.

రాష్ట్రాన్ని మలుపు తిప్పిన అడుగులు

- సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం
- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు


మున్సిపల్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


సామర్లకోట జగనన్న కాలనీలో వైఎస్సార్ కాంస్య విగ్రహం వద్ద కేక్ కట్ చేసిన దవులూరి దొరబాబు, చిత్రంలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు

పెద్దాపురం: దేశ రాజకీయాల్లో ఓ సంచలనంగా ప్రజానేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర రాష్ట్ర చరిత్రను మలుపుతిప్పిందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. ప్రజా సంక్షేమ సారథిగా ప్రజలందరి గుండెల్లో సుస్థిర స్థానం సాధించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. ప్రజానేత పాదయాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం స్థానిక మున్సిపల్ సెంటర్‌లో పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు. రాష్ట్ర కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, కౌన్సిలర్లు కలిసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి, స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ నవ్యాంధ్ర భవితకు తొలి అడుగు వేసి, వేలాది మైళ్ల పాదయాత్రలో కోట్లాది ప్రజలను కలిసి, వారి వేదనను తెలుసుకుని.. కన్నీళ్లు తుడిచిన జననేత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కులం, మతం, వర్గభేదాల్లేకుండా, కనీవినీ ఎరుగని పథకాలతో.. పార్టీరహితంగా సంక్షేమ పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా, దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలను నెరవేరుస్తూ, అందరి ఆదరణ పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మిరియాల రాజా, కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, విజ్జపు రాజశేఖర్, విడదాసరి రాజా, ఆరెళ్లి వీర్రాఘవులు, కొట్టి పవన్, పాగా సురేష్, సర్పంచ్‌లు కనపర్తి చీమదొర, ఒబిలిశెట్టి అబ్బాయి, బర్రే రామగోవిందు, సుందరెడ్డి రాజు, దాడి చంటి, తుమ్మల అచ్యుతరామయ్య, నల్లల గోవిందు, ఏలేటి అనంతలక్ష్మి, గుర్రాల యాకోబు, వాసిరెడ్డి శ్రీనివాస్, శైల గణేష్, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, మాజీ జెడ్పీటీసీ బంగారు కృష్ణ, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మరోసారి అధికారంలోకి వైఎస్సార్ సీపీ : దొరబాబు

సామర్లకోట: ప్రజా సంకల్ప యాత్రలో గుర్తించిన సమస్యలను పరిష్కరించడంతో పాటు, ఎన్నికల హామీ మేరకు నవరత్నాలను అమలు చేసిన నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. ప్రజలందరూ ఆయననే తిరిగి ముఖ్యమంత్రిగా కోరుకుంటున్నారని, వైఎస్సార్ సీపీ తిరిగి అధికారం చేపట్టడం ఖాయమని చెప్పారు. ప్రజా సంకల్ప యాత్ర నిర్వహించి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద వైఎస్సార్ విగ్రహానికి, జగనన్న కాలనీలో 18 అడుగుల వైఎస్సార్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. జగనన్న కాలనీ విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. దొరబాబు మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్రలో గుర్తించిన సమస్యలు, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 99.9 శాతం పూర్తి చేశారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా ఆదుకుంటానని ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తున్నారన్నారు. ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం కోసం పనిచేస్తున్న వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని, పొత్తుల పార్టీలు కనుమరుగవ్వక తప్పదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సూచనల మేరకే పవన్ కల్యాణ్ నడుచుకుంటున్నారని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాలనూ వైఎస్సార్ సీపీ గెలుచుకుంటుందని చెప్పారు. ఈ విషయం తెలిసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్.. ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. పెద్దాపురం నియోజకవర్గంలో భారీ మెజార్టీతో వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేస్తామని, అక్టోబరు 12న సామర్లకోటలో జరిగిన బహిరంగ సభే ఇందుకు నిదర్శనమని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మండల ఉపాధ్యక్షుడు ములసా శ్రీను, పార్టీ పట్టణ అధ్యక్షుడు మద్దాల శ్రీను, మండల అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, కౌన్సిలర్లు రెడ్డి లోవకుమారి, పాలిక కుసుమ, పిట్టా సత్యనారాయణ, జట్ల మోహన్, పాగా సురేష్‌కుమార్, నేతల హరిబాబు, సేపెని సురేష్, మాజీ కౌన్సిలర్లు గంగిరెడ్డి కృష్ణమూర్తి, గృహసారథుల పట్టణ కన్వీనర్ ఇరుసుమల్ల సాయి, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ వారా సుధాకర్ పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి


డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి

గండేపల్లి: యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పెద్దాపురం డీఎస్పీ లతా కుమారి సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో సోమవారం డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ లతాకుమారి మాట్లాడుతూ విద్యార్థులు, యువత సన్మార్గంలో సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. చెడు వ్యసనాలకు ఆకర్షితులై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అనంతరం సీఎస్ఈ–ఏఐ, ఎంఎల్ అడ్వాన్స్‌డ్ ప్రోగ్రామింగ్ నూతన ల్యాబ్‌లను ఆమె ప్రారంభించారు.

'కురుక్షేత్ర' సభను విజయవంతం చేయాలి

తుని: ఢిల్లీలో ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించే కురుక్షేత్ర సంగ్రామ సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ కోరారు. లోవ కొత్తూరులో సోమవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మాదిగలను మోసం చేసిందన్నారు. 2014, 2019 ఎన్నికల సమయంలో మాదిగ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెడతామని చెప్పారని, ఇప్పటికీ అమలు కాలేదన్నారు. 2024 ఎన్నికల్లో అన్ని రాష్ట్రాల్లోనూ ఎస్సీ వర్గీకరణ చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టాలని డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు.